అభివృద్ధి పథంలో గుడివాకలంక

నాలుగున్నరేళ్లలో రూ.9.8 కోట్ల పనులు


రూ 4.50 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్


ఓవర్‌హెడ్ ట్యాంక్

ఏలూరు రూరల్: ఏలూరు మండలం కొల్లేరు ప్రధాన గ్రామం గుడివాకలంక అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత మౌలిక వసతులు కల్పించారు. సంక్షేమ పథకాలతో పేదలు జీవితాలు మెరుగుపడ్డాయి. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.9.8 కోట్లు గ్రామాభివృద్ధికి ఖర్చుచేశారు.

అభివృద్ధి పనులు ఇవీ

గ్రామంలో మౌలిక వసతుల కల్పన దాదాపు పూర్తయింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.60 లక్షల రూర్బన్ నిధులతో గ్రామ కూడలిలో భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. కొల్లేరు గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు రూ.4.50 కోట్లతో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. రూ.21 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో కొత్త తాగునీటి పైప్‌లైన్ వేసి, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు బిగించారు. రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రామ పంచాయతీ తాగునీటి చెరువుల చుట్టూ కంచె ఏర్పాటుచేశారు. మరో రూ.20 లక్షల ఎంపీ నిధులతో కొల్లేరు వద్ద తాగునీటి చెరువు నుంచి నీటిని పంపింగ్‌కు ప్రధాన పైప్‌లైన్ వేశారు. జగనన్న కాలనీ మెరక పనులకు ప్రభుత్వం రెండు దఫాలుగా సుమారు రూ.1.50 కోట్లు ఖర్చు పెట్టింది. వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. రూ.80 లక్షలు ఉపాధి హామీ పథకం, రూర్బన్ నిధులు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ.15 లక్షల ఖర్చు చేసి డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. రూ.40 లక్షలతో సచివాలయం నిర్మించారు.

రూ.2.12 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

నాడు – నేడు పథకంలో కొల్లేరు గ్రామాల బాలబాలికల ఉన్నత విద్యకు బాటలు వేసింది. తొలి విడత రూ.17 లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, ఫ్లోరింగ్, బల్లలు ఏర్పాటు చేశారు. రెండో విడత ఈ ఏడాది జెడ్పీ పాఠశాలకు రూ.1 కోటీ 95 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కావచ్చింది.


చురుగ్గా సాగుతున్న జెడ్పీ పాఠశాల తరగతి గదుల నిర్మాణం


మండల పరిషత్ పాఠశాలకు నూతన శోభ

పథకాలతో మేలు

చేపల సాగు, చేపల వేటతో జీవనోపాధి పొందుతున్న ప్రజలకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ద్వారా లక్షల రూపాయల ఆర్థిక సహకారం అందిస్తోంది. సంక్షేమ పథకాల అమలుతో గ్రామీణులకు ఆర్థిక భరోసా ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 527 మందికి రూ.1,31,75,000, అమ్మఒడి ద్వారా 695 మందికి రూ.2,66,13,000, జగనన్న విద్యా దీవెన ద్వారా 58 మందికి రూ.41,833లు అందుకున్నారు. 770 మంది డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.2,01,33,000 ఆసరా పథకం లబ్ధి పొందారు. 71 మంది అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. వీటితో పాటు నెలనెలా 550 మంది రూ.18,76,000 పింఛన్ అందుకుంటున్నారు.

అర్హులందరికీ పథకాలు



రూ.కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, సచివాలయం, పాఠశాల తరగతి గదులు, ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. గతంలో ఇంత పెద్ద ఎత్తున నిధులు ఎన్నడూ విడుదల కాలేదు. మా గ్రామస్తులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.కోట్ల లబ్ధి చేకూరింది.

– రుక్మనంధ్, వార్డు సభ్యుడు

అభివృద్ధి పరుగు



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషితో కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టించాం. ప్రతి గ్రామంలో కనీసం రూ.5 కోట్లు నుంచి రూ.6 కోట్లు విలువ గల పనులు పూర్తిచేశారు. సంక్షేమ పథకాలను కొల్లేరు ప్రజలు పెద్ద ఎత్తున అందుకుంటున్నారు. కొల్లేరు గ్రామాలన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయి.

– పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

ఎమ్మెల్యే కృషి వెలకట్టలేం



మా గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేసిన కృషి చాలా గొప్పది. ప్రత్యేక చొరవ చూపి అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు మా ప్రజల జీవన స్థితి గతులను మార్చేశాయి. ప్రజలు ఆర్థికంగా బలపడ్డారు. సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యేకు కూడా రుణపడి ఉన్నాం.

– జయమంగళ రామారావు, మాజీ ఎంపీపీ

క్లుప్తంగా

ఉమా నందూరిని కలిసిన కలెక్టర్


ఉమా నందూరికి మొక్కను అందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లా ప్రభావరి అధికారి ఉమా నందూరిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ద్వారకాతిరుమల మండలం గున్నంపల్లిలో నిర్వహించిన భారత్ వికాస్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొన్నారు. అనంతరం స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఉమా నందూరిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో భారత వికాస్ సంకల్ప యాత్ర అమలుపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్బారావు ఉన్నారు.

దాసాంజనేయ స్వామి ఆలయం ముస్తాబు


దాసాంజనేయ స్వామి ఆలయంలో శుభ్రం చేస్తున్న భక్తులు

ఏలూరు (టూటౌన్): అయోధ్యలోని శ్రీరామ చంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా భక్తులు శనివారపుపేటలోని అతిపురాతనమైన శ్రీదాసాంజనేయ స్వామి ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను ఆదివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో భక్తులు నడపన దాన భాస్కరరావు, గెద్దాడ మల్లికార్జున రావు, కొప్పిశెట్టి వేణుగోపాల్, మేకల శ్రీకృష్ణ దేవరాయలు, ఇట్టాల కృష్ణారావు, పవన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

ఏలూరు (టూటౌన్): పెరిగిన ధరలకు అనుగుణంగా దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలని ఏపీ వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఫ్లోర్ వాకర్లకు, మంచానికే పరిమితమైన వారికి రూ.10 వేలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వామపక్ష పార్టీల వినతి

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతూ.. వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని వామపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆదివారం విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం పంపిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు శానం నాగరాజు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ ఉన్నారు.

సంతాన వేణుగోపాల స్వామికి అభిషేకాలు


స్వామికి ప్రకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తూర్పువీధి సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రమైన రోహిణి నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామి వారికి సహస్ర తులసిదళాలతో నామార్చన నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఇస్కాన్ ఏలూరు శాఖకు చెందిన తేజోమయ దాస్ బృందం ఆధ్వర్యంలో స్వామి వారి నామసంకీర్తన నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు శేషవాహనంపై ప్రాకారోత్సవం నిర్వహించారు. అర్చకులు వేదాంతం విజయ వెంకట రామానుజాచార్యులు విశేష పూజలు చేశారు.

లెనిన్‌కు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): విప్లవ సారధి లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుని బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రమ జీవులను ఏకం చేసి పోరాటాలు చేయడం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు పునరుద్ఘాటించారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సీపీఐ, సీపీఎం జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రంతో ఉన్న క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య, యు.హేమశంకర్, సీపీఎం నాయకులు ఎ.రవి, పి.కిషోర్ మాట్లాడారు.

సీపీఎం కార్యాలయంలో

సోవియట్ రష్యాలో కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించడంలో ముఖ్యపాత్ర వహించిన కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం నాయకులు పి.కిషోర్, కంది విశ్వనాథం, పిచ్చుక ఆదిశేషు, ఎ.రవి లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐకమత్యంతో పని చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో పేదలకు సేవ చేయడంలో ముందుండే ఆర్యవైశ్యులు ఐకమత్యంగా ఉండి సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ సూచించారు. ఆదివారం స్థానిక పవర్‌పేట అంబికా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రతినిధులకు నియామక పత్రాలు అందచేశారు. ఆర్యవైశ్య సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షునిగా దివ్వెల జయబాబు, కార్యదర్శిగా వేమా సురేష్, కోశాధికారిగా బచ్చు విష్ణు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దుల రవి కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గాదంశెట్టి శ్రీనివాసరావు, 10 మంది ఉపాధ్యక్షులు, 10 మంది సహాయ కార్యదర్శులు, 10 మంది కార్యవర్గ సభ్యులకు ఆయన నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికా రాజా, చెన్నా వెంకట్రామయ్య, మానేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులకు నియామక పత్రాలు అందిస్తున్న అంబికా కృష్ణ

128 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్ష చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్‌క్లబ్ ఏలూరు జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు ఆదివారం 128 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్స అవసరమని ఆపరేషన్‌కు ఏర్పాటు చేశారు. 36 మందికి సబ్సిడీ ధరకు కళ్లజోళ్లు అందించారు. రామారావు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నామని, ప్రతి నెలా 3వ ఆదివారం రామకోటి ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెక్కా రాజారావు, అల్లం వెంకట సుబ్బారావు, బొడ్డు శ్రీనివాసు, గొల్లపూడి రామకృష్ణ, బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నేడు అయోధ్య రాముని సంబరాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఏలూరు నగరంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏలూరు రౌండ్ టేబుల్, హిందూ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి, అంబికా గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఏలూరు రామకోటి రామాలయంలో అయోధ్య రాముని ఆనంద సంబరాలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఏలూరు పెద్ద వంతెన నుంచి మేళతాళాలతో, తీన్మార్ డప్పులతో, కోలాటాలతో భక్త భజన కార్యక్రమాలతో అయోధ్య రాముని భారీ ఊరేగింపు రామకోటి వరకు నిర్వహిస్తారు. రామకోటి శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి, మహిళా భక్తులతో మహాహారతి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం భారీగా బాణసంచా పేల్చి భద్రాద్రి రాముని ప్రసాద వితరణ చేస్తారు. వైఎంహెచ్ఏ హాలులో సాయంత్రం 4 గంటల నుంచి శ్రీరాముని గీతాలాపన, అఖండ దీపారాధన, ప్రసాద వితరణ చేస్తారు. పవర్‌పేట కోదండ రామాలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీరామనామ తారక మంత్ర పారాయణం నిర్వహిస్తారు. జూట్ మిల్లు వద్ద ఉన్న ధర్మభేరి ప్రాంగణంలో ఉదయం 7.30 గంటల నుంచి శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేస్తారు. సాయంత్రం సీత, లక్ష్మణ, హనుమత్ సహిత శ్రీరామ చంద్రమూర్తికి దర్బారు సేవ, పుష్పయాగం, సహస్ర దీపాలంకరణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేస్తారు. ఏడు ఘోరీల సెంటర్‌లో ఆదర్శ ఆంజనేయ స్వామి దేవస్థానం, కృష్ణా గోదావరి ట్రాన్స్‌పోర్టు సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి పూజలు, అనంతరం రామభజన, ప్రసాద వితరణ ఉంటుంది. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు వీలుగా భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. తూర్పువీధి శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉదయం 10.30 గంటల నుంచి హరే శ్రీనివాస భక్త బృందం ఆధ్వర్యంలో హరే రామ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారు. సాయంత్రం ఆలయంలో దీపోత్సవం నిర్వహించి ప్రసాద వితరణ చేయనున్నారు.


నరసింహారావుపేటలో ఒక గృహం వద్ద జై శ్రీరామ్ నినాదాన్ని ముద్రిస్తున్న యువత

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

ఉంగుటూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం గోపినాథపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు కుట్రలు చేయడం మానుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకూ 95 శాతంపైన సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ముందుగా సర్పంచ్ విష్ణు ఎమ్మెల్యే వాసుబాబుకు పూల దండలు వేసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబరు గాదిరాజు సుబ్బరాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడమంగరావు, ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గంటాలక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చూకూరి నాగబాబు, ఉపసర్పంచ్ మన్నేయామిని, బళ్ల త్రిమూర్తులు, పలు గ్రామాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గోపినాథపట్నంలో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	44
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	56
బెండకాయలు	28	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	46	కంద	52
కాకర కాయలు	48-52	బీట్‌రూట్	36
బీరకాయలు	52	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	60	ఫ్రెంచ్‌బీన్స్	84
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	08
దోసకాయలు	38-48	పుదీనా	05
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	78
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	03
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	01
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	15